


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

శుక్రవారం 18 అక్టోబరు 2024

కారెట్ల నడిపిండో..
డ్రైవర్ రావాలి

- తూప్రాన్ ఆస్పత్రి వద్ద బంధువుల గొడవ
- మృతదేహాలను తరలించే ట్రాక్టర్ అడ్డగింత
- ఉద్రిక్తతల మధ్య శవాల అప్పగింత
- ముగిసిన అంత్యక్రియలు
- నామ్‌సింగ్ కొడుకు రాజేష్‌పై దాడికి యత్నం

7

గృహం.. గ్రహణం

- 'డబుల్ బెడ్రూం ఇళ్ల' పంపిణీపై అయోమయం
- గత ప్రభుత్వ హయాంలో పెద్దసంఖ్యలో నిర్మాణం
- ఉమ్మడి మెదక్ జిల్లాకు 26,635 ఇళ్లు
- లబ్ధిదారులకు పంచినవి కొన్నే..
- నిరుపయోగంగా ఇంకొన్ని.. అసంపూర్తిగా మరికొన్ని
- పూర్తయిన ఇళ్లనూ పంపిణీ చేయని అధికారులు
- గృహప్రవేశాలకు ముందే శిథిలమవుతున్న తీరు
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా



చేగుంట మండలం బి.కొండాపూర్‌లో అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్లు

గత ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్ల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. కొన్నిచోట్ల మినహాయిస్తే దాదాపు డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయాల వద్ద అధ్వాన పరిస్థితులు ఉన్నాయి. నిర్మాణంలో లోపాలు, పంపిణీలో అవకతవకలు, కాంట్రాక్టర్ల అలకలు, అసంపూర్తిగా ఉన్న గృహాలు వెరసి సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నాయి. చకచకా పూర్తిచేసిన ఇళ్లను కూడా ఏళ్ల తరబడిగా పంపిణీ చేయకపోవడమే పెద్ద సమస్యగా మారింది. ఇక హడావిడిగా నిర్మాణాలను ప్రారంభించిన ఇళ్లు సైతం అసంపూర్తిగా వెక్కిరిస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 26వేలకు పైగా ఇళ్లు మంజూరైతే దాదాపు 17 వేల ఇళ్లను పూర్తిచేసినట్లు చెబుతున్నారు. ఇందులో 16వేల ఇళ్ల వరకు పంపిణీ చేశామని అధికారులు పేర్కొంటున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి.

7

జిల్లా	మొత్తం ఇళ్లు	పూర్తయినవి	పంపిణీ చేసినవి
సిద్దిపేట	15,925	10,424	9,980
మెదక్	4,776	2,759	2,323
సంగారెడ్డి	5,934	4,194	4,146

'సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణ శివారులో 795 డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మొదటి దశలో 130 గృహాల నిర్మాణ పనులు పూర్తికాగా మిగితా పనులు పెండింగులోనే ఉన్నాయి. పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వడానికి లాటరీలో ఎంపిక ప్రక్రియ చేపట్టారు. కానీ వారికి ఇళ్ల పంపిణీ చేయలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో గత లబ్ధిదారులకే ఇస్తారా.. కొత్తవాళ్లను ఎంపిక చేస్తారా అనే అనుమానాలున్నాయి. ప్రస్తుతం ఇళ్లన్నీ అధ్వానస్థితికి చేరి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.'

'మెదక్ పట్టణంలోని పిల్లికొట్టాల వద్ద నిర్మించిన డబుల్‌బెడ్రూం కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. ఇక్కడ 950 ఇళ్ల నిర్మాణం చేపట్టగా.. 561 మాత్రమే లబ్ధిదారులకు అందజేశారు. మరో 100 ఇళ్ల నిర్మాణం పూర్తయినా పంపిణీ చేయడంలేదు. 289 ఇళ్లు వివిధ దశల్లో నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు జీఎస్టీ, నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిపివేశారు. నిధులు విడుదలైతే తప్ప పనులు పూర్తిచేసేలా కనిపించడం లేదు.'

'సిద్దిపేట జిల్లా తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లిలో 20 జీప్లస్-2 డబుల్‌బెడ్రూం ఇళ్లను నిర్మించారు. మొక్కుబడిగా లబ్ధిదారులను ఎంపికచేసి ఇళ్లను అందజేసి చేతులు దులుపుకున్నారు. ఇళ్లలో మరుగుదొడ్లను సరిగ్గా నిర్మించలేకపోవడంతో ఆరుబయటకు పోతున్నారు. విద్యుత్ కనెక్షన్ లేక స్తంభాలకు కొక్కేలు తగిలించుకుంటున్నారు. ఇదే మండలం బండారుపల్లిలో జీప్లస్-2 డబుల్ ఇళ్లు 20ను నిర్మించి ఆరేళ్లవుతున్నా లబ్ధిదారులకు పంపిణీ చేయనందున శిథిలావస్థకు చేరుతున్నాయి.'



తొగుట మండలం బండారుపల్లిలో పంపిణీ చేయకముందే శిథిలమవుతున్న డబుల్‌బెడ్రూం ఇళ్లు



సినిమా షూటింగ్‌లో స్మరణ్‌రెడ్డి

మెగాఫోన్ పట్టిన మనోడు..

- డైరెక్టర్‌గా చేర్యాల వాసి
- నేడే మొదటి సినిమా విడుదల
- 'లవ్ రెడ్డి' గుర్తుండిపోతుంది
- దర్శకుడు స్మరణ్‌రెడ్డి

7

పాఠశాలల్లో వసతులు లోపిస్తే కఠిన చర్యలు

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

8

మినీట్యాంక్‌బండ్ కల తీరేనా!?

- ఏడేళ్ల క్రితం పనులు ప్రారంభం.. అర్ధాంతరంగా పనులు నిలిచి ఐదేళ్లు
- మత్తడి నీటి ప్రవాహ మళ్లింపు కాలువ నిర్మాణానికి నిధుల మళ్లింపు
- అసంపూర్తిగానే రెండు పనులూ

8

ఉద్యోగాల పేరిట సైబర్ మోసం

- మోసపోయిన 25 మంది
- గజ్వేల్‌లో ఘటన, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు

గజ్వేల్, అక్టోబరు 17: విద్యుత్‌శాఖలో కంప్యూటర్ ఆపరేటర్ల ఉద్యోగాల పేరుతో నగదును కొల్లగొట్టిన సంఘటన గజ్వేల్‌లో గురువారం వెలుగుచూసింది. గజ్వేల్ పట్టణానికి చెందిన ఓ ప్రజాప్రతినిధికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీరు ప్రజాప్రతినిధి కదా.. మీ మనుషులుంటే విద్యుత్‌శాఖలో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల్లో భర్తీ చేయించుకోవాలని చెప్పాడు. వెంటనే అప్రమత్తమైన ప్రజాప్రతినిధి వారి అనుచరుల ద్వారా దాదాపుగా 25 మందికి ఈ విషయాన్ని చేరవేయడంతో వారు అప్లికేషన్ ఫీజు పేరిట తలా ఒక రూ.1400 చొప్పున రూ.35వేల నగదును గుర్తు తెలియని ఆగంతకుడికి ట్రాన్స్‌ఫర్ చేశారు. ట్రాన్స్‌ఫర్ చేసిన అనంతరం సదరు నంబర్‌కు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తేరుకున్న బాధితులు గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మొగులు..గుబులు

- రైతన్నను భయపెడుతున్న వర్షాలు
- వర్షాలతో నేలవాలిన వరి
- నల్లబారుతున్న పత్తి.. ఆందోళనలో అన్నదాతలు

గజ్వేల్/చిన్నకోడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పంటను పండించిన రైతన్నకు అడుగడుగునా చిక్కులు ఎదురవుతున్నాయి. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో ప్రస్తుతం రైతుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. ఓ వైపు కోతలు, మరోవైపు కల్లాల్లో ఆరబెట్టిన పంటను వర్షాల నుంచి కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఆకాశంలో మబ్బులు కమ్ముకోగానే ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పి అక్కడే పడిగాపులు కాస్తున్నారు. ఈ వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు లేక రైతులు ఆకాశం వైపు చూశారు. ఆ తర్వాత ఏకబిగిన భారీ వర్షాలు కురిసాయి. పలుచోట్ల భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. మరికొన్నిచోట్ల పొలాల్లో నీరు నిలిచి పంటలకు నష్టం వాటిల్లింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, గాలి దుమారంతో చేతికొచ్చిన వరి పంట నేలకొరిగింది. పత్తి నల్లబారిపోతుంది. ఈ క్రమంలో పత్తి ధర పడిపోయే అవకాశాలున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం ఉదయం ఉరుములు, మెరుపులు, గాలి దుమారంతో కురిసిన భారీ వర్షంతో చేతికి వచ్చిన వరి పంట అనేక గ్రామాల్లో నేలకొరిగింది. మొక్కజొన్న పంటకు సైతం నష్టం వాటిల్లే అవకాశాలున్నాయి. కూరగాయ పంటలు దెబ్బతింటున్నాయి.

భారీ దిగుబడి ఆశించిన రైతన్నలు

జిల్లాలో ఐదు లక్షల 20వేల ఎకరాలు ఆయా పంటలను రైతులు సాగు (మిగతా 8వ పేజీలో..)



చిన్నకోడూరు మండలం మేడిపల్లిలో వర్షానికి నేలకొరిగిన వరి చేను



పత్తి కాత అంతంతే..

- చెట్టుకు 5 నుంచి 10 లోపు కాయలలోపే!!
- పంటకు తెగుళ్ల బెడద
- ధర లేకపోతే నష్టాలే
- ఆందోళనలో రైతులు

8

జిల్లా అభివృద్ధికి నిరంతర కృషి

- స్టడీ సర్కిల్స్ ద్వారా ఉచిత శిక్షణ అందిస్తాం
- జిల్లాకు మూడు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్
- మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతిపక్షం, అధికారపక్ష నియోజకవర్గాలు అనే తేడా లేకుండా జిల్లా అభివృద్ధికి పనిచేస్తానని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో రెండోదశలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలు కాంప్లెక్స్‌లు మంజూరయ్యేలా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతానని చెప్పారు. ఇందుకోసం మూడు నియోజకవర్గాల్లో సుమారు 25 ఎకరాల స్థల సేకరణ చేయాలని ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జులకు సూచించారు. గురువారం సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా కేడం లింగమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కేడం లింగమూర్తిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విపంచి కళానిలయంలో లింగమూర్తి ప్రమాణ స్వీకారోత్సం నిర్వహించారు. లైబ్రరీ సెక్రటరీ లింగమూర్తితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. లింగమూర్తి నడిచే ఎన్‌సైక్లోపీడియా అని, సీనియర్ నాయకుడని కొనియాడారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన లింగమూర్తిపై గురుతర బాధ్యత ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పోటీ పరీక్షల్లో సిద్దిపేట జిల్లా నుంచి ఎక్కువ ఉద్యోగాలు సాధించాలని, అందుకు లైబ్రరీ దోహదపడాలని ఆకాంక్షించారు. స్టడీ సర్కిల్స్ ద్వారా ఉచిత శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టుల నియామక ప్రక్రియ త్వరలోనే చేపడతామన్నారు.

గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దుతున్నాం

ప్రస్తుతం ప్రజాపాలన కొనసాగుతోందని, కావాలని ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడితే సహించేది లేదని, బకాయిల పేరుతో.. అద్దెల పేరుతో తరగతులు నిర్వహించపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో వాళ్లు చెప్పిందే వినాల్సిన పరిస్థితి ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు. రైతులకు అప్పు ఉండకూడదనే ఉద్దేశంతో రూ. 2లక్షల రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. గత ప్రభుత్వం గురుకుల భవనాల అద్దెలు చెల్లించలేదని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయలేదని, అప్పటి సమస్యలను ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం దశల వారీగా పరిష్కరిస్తుందన్నారు. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యతనిస్తుందని, డీఎస్సీ పూర్తి చేసి ఉపాధ్యాయ నియమాకాలు చేపట్టామని, రూ. 5వేల కోట్లతో 29 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలు కాంప్లెక్స్‌లకు శంకుస్థాపన చేసుకున్నామని చెప్పారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



బాధ్యతలు స్వీకరిస్తున్న లింగమూర్తి

అందరికీ అవసరమయ్యేలా..

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కేడం లింగమూర్తి మాట్లాడుతూ అందరి సహకారంతో నిరుద్యోగులకు అవసరమయ్యేలా లైబ్రరీని తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మండలాలు, గ్రామాల వారిగా నిరుద్యోగుల జాబితా తయారు చేసి గ్రంథాలయాన్ని అందరికి అవసరమయ్యేలా చూస్తానని చెప్పారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జులు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, తూంకుంట నర్సారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి సభలో ప్లకార్డు ప్రదర్శన

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 317తో ఇబ్బందులు పడుతున్నామని జిల్లాకు చెందిన ఉపాధ్యాయ, ఉద్యోగులు మంత్రి పొన్నం దృష్టికి తీసుకువచ్చారు. సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రమాణస్వీకార సభలో మంత్రి పాల్గొనగా.. పలువురు సభలో ప్లకార్డులను ప్రదర్శించారు. సభ తర్వాత వారిని మంత్రి పొన్నం వారిని వేదిక మీదకు పిలిచి, సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జీవో వల్ల ఉద్యోగులకు సొంత జిల్లాలో కాకుండా ఇతర జిల్లాలకు బదిలీ అయ్యామని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

'సమాజంలో పట్టభద్రులు కీలకం'



ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వి.నరేందర్‌రెడ్డి

హుస్నాబాద్ అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 17 : పట్టభద్రులు సమాజంలో కీలకంగా వ్యవహరిస్తారని, అభివృద్ధికి బాట వేస్తారని అల్ఫోర్స్ సంస్థల అధినేత, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. హుస్నాబాద్‌లో గురువారం పట్టభద్రుల ఓటర్ నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బస్‌స్టేషన్ ఎదురుగా నమోదు కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు.







ఘనంగా వాల్మీకి జయంతి

మహర్షి వాల్మీకి జయంతిని గురువారం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరి క్రాంతి, మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

- మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి)

చెరువులో చేపలు మృతి

హత్నూర, అక్టోబరు 17 : హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల భీముని చెరువులో చేపలు మృతి చెందాయి. గ్రామ మత్స్యకారులకు జీవనాధారమైన చేపలు మృతి చెందడం పట్ల వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ చెరువుకు పైభాగంలో ఉన్న తుర్కలాఖానాపూర్, చందాపూర్, బోర్పట్ల గ్రామ శివారులోని పరిశ్రమల కాలుష్య జలాలతోనే చేపలు మృతి చెందినట్లు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. పీసీబీ అధికారులు స్పందించి విచారణ అనంతరం పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సంగారెడ్డి పీసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.



భీముని చెరువులో మృతిచెందిన చేపలు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● ఒకరికి గాయాలు



రాజీవ్ రహదారిపై వనిత మృతదేహం

వర్గల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై వెళ్తున్న తల్లికొడుకు వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొనగా తల్లి కిందపడగా మరో వాహనం ఆమె తలపై నుంచి వెళ్లడంతో మృతిచెందిన సంఘటన వర్గల్ మండలం గౌరారం రాజీవ్ రహదారిపై గురువారం చోటుచేసుకున్నది. గౌరారం ఎస్ఐ కరుణకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నాగపురం గ్రామానికి చెందిన బాలేష్ తన యాక్టివా బండిపై తల్లి వనితతో హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. గౌరారం వద్దకు చేరుకోగా మార్స్ ఇండియా పరిశ్రమ ఎదుట గుర్తుతెలియని వాహనం వెనుకవైపు నుంచి అతివేగంగా వచ్చి వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నది. వెనుక కూర్చొన వనిత కిందపడింది. అదే సమయంలో మరో వాహనం ఆమెపై నుంచి వెళ్లడంతో తలకు బలమైన గాయం కావడంతో వనిత అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అతివేగంతో అదుపు తప్పిన కారు..

ఒకరి దుర్మరణం



ఆస్పత్రిలో రాజేష్ మృతదేహం

కుకునూరుపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అతివేగంతో నడుపుతున్న కారు అదుపు తప్పడంతో ఒకరు మృతిచెందిన సంఘటన కుకునూరుపల్లి శివారులో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లికి చెందిన కార్వా రాజేష్(42) బుధవారం హైదరాబాద్ నుంచి బెల్లంపల్లికి వచ్చి కుటుంబసభ్యులను కలిసి అర్ధరాత్రి దాటిన తర్వాత హైదరాబాద్‌కి తిరుగు ప్రయాణమయ్యాడు. కారును అతివేగంగా నడపడంతో కుకునూరుపల్లి గ్రామ శివారులో మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఇనుప రాడ్‌ను ఢీకొట్టింది. అనంతరం ఆ పక్కనే ఉన్న మరో కారును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వృద్ధుడి ఆత్మహత్య



నాగయ్య మృతదేహం

తూప్రాన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : వృద్ధుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూప్రాన్ పట్టణంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణంలో నివాసముంటున్న ఉడత లక్ష్మి, నాగయ్య(75) దంపతులు పండ్ల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. బుధవారం రాత్రి దంపతులిద్దరు భోజనం చేసి వేర్వేరు గదుల్లో పడుకున్నారు. అర్ధరాత్రి సమయంలో ఉడుత నాగయ్య ఇంటి తలుపులకు గడియపెట్టి బయట ఉరేసుకున్నాడు. అర్ధరాత్రి తరువాత లేచిన భార్య లక్ష్మి భర్త లేకపోవడంతో తలుపులు తెరిచేందుకు ప్రయత్నించగా, గడియపెట్టి ఉంది. పక్కన ఇంటివారికి తెలుపగా, గడియ తీయడంతో బయటకు రాగా నాగయ్య ఉరేసుకుని కనిపించాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.



మెదక్ పట్టణంలోని పిల్లికొట్టాల వద్ద అసంపూర్తిగా డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం

గృహం.. గ్రహణం

డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీపై అయోమయం

- ఉమ్మడి మెదక్ జిల్లాకు 26,635 ఇళ్లు
- లబ్ధిదారులకు పంచినవి కొన్నే..
- నిరూపయోగంగా ఇంకొన్ని.. అసంపూర్తిగా మరికొన్ని
- పూర్తయిన ఇళ్లనూ పంపిణీ చేయని వైనం
- గృహప్రవేశాలకు ముందే శిథిలమవుతున్న తీరు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి,సంగారెడ్డి, అక్టోబరు 17 : కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహించారు. 2018లో పూర్తయిన ఇళ్లను కూడా ఇప్పటిదాకా అర్హులకు ఇవ్వలేదంటే అతిశయోక్తి కాదు. దీంతో ఆ ఇళ్లన్నీ పర్యవేక్షణ లేక శిథిలావస్థకు చేరుతున్నాయి. తలుపులు, కిటికీలు, విద్యుత్ మీటర్లు, మరుగుదొడ్లు, గోడలు ధ్వంసమవుతున్నాయి. ఇటు లబ్ధిదారులకు అందక, అటు అధికారుల పర్యవేక్షణలో ఉండక కొత్త ఇళ్లన్ని పాడుబడిన భవనాలను తలపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఈ ఇళ్లపై దృష్టి పెట్టి అర్హులైన లబ్ధిదారులకు అందజేయాల్సిన అవసరం కనిపిస్తోంది. లేదంటే గత ప్రభుత్వం ఈ ఇళ్లపై వెచ్చించిన నిధులను దుర్వినియోగమే అవుతాయి.

డబుల్ ఇళ్లల్లో ట్రబుల్స్

● రామాయంపేటలో 305 ఇళ్లకు 250 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇళ్ల వద్ద డ్రైనేజీ పైపులైన్లు పగిలి దుర్గంధం వెదజల్లుతోంది. సరైన రోడ్లు లేక పొలాల మీదుగా భయపడుతూ వెళ్లాల్సిన పరిస్థితి.

● కొమురవెల్లి మండలం గౌరాయపల్లి శివారులో 20 ఇళ్ల నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు.

● శివ్వంపేట మండలం పిట్టలవాడ, దంతాన్‌పల్లి, దొంతి గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు సరైన రహదారులు, మురుగు కాలువలు లేవు. ఇళ్లలో మరుగుదొడ్లు సరిగ్గా లేక ఇబ్బంది పడుతున్నారు.

● ములుగు మండలం బస్వాపూర్, బండ మైలారం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉంది.

● నర్సాపూర్ పట్టణంలో 500 ఇళ్లు మంజూరు చేయగా 248 పూర్తయ్యాయి. మిగతా వాటిని అసంపూర్తిగా వదిలేశారు. పూర్తయిన ఇళ్లను కూడా ఇప్పటిదాకా లబ్ధిదారులకు అందజేయలేదు. ఎనిమిదేళ్లుగా పట్టణంలోని అర్హులు ఎదురుచూస్తున్నారు. 4 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు.

● మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వగ్రామమైన చింతమడక, సీతారాంపల్లి, మాచాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. సీసీ రోడ్లు పూర్తిగా నిర్మించలేదు.

● జిన్నారం మండల కేంద్రంలో 60 ఇళ్లు, కొడకంచిలో 50 ఇళ్లు అసంపూర్తిగా నిలిచాయి. ఏ ఒక్క లబ్ధిదారుడికి పంపిణీ చేయలేదు.

● మనోహరాబాద్‌లో నిర్మించిన డబుల్ ఇళ్ల కిటికీలు, తలుపులను ధ్వంసం చేశారు. ఇవే ఇళ్లను పంపిణీ చేయగా లబ్ధిదారులు సైతం మరమ్మతులు చేసుకోకుండా వినియోగిస్తున్నారు.

● కొండాపూర్ మండల కేంద్రంతోపాటు తొగర్‌పల్లి, అలియాబాద్‌లో ఇళ్లను పంపిణీ చేయగా కొంతమంది అద్దెకు ఇచ్చినట్లు సమాచారం.

● అందోలు-జోగిపేటలో 380 డబుల్ ఇళ్లు, డాకూర్‌లో 59 ఇళ్లు నిర్మించి పంపిణీ చేశారు. కానీ ఈ ఇళ్ల వద్ద అంతర్గత రహదారులు నిర్మించలేదు.

● సదాశివపేట పట్టణ పరిధిలోని సిద్దాపూర్ కాలనీలో 554 ఇళ్లు నిర్మించారు. ఈ కాలనీలో అంతర్గత రోడ్లు లేవు. డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు నీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. 15 రోజులకోసారి తాగునీటిని అందిస్తున్నారు. 30 శాతం మంది అనర్హులకే కేటాయించారనే ఆరోపణ లున్నాయి.

● చేగుంట మండలంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయకున్నా కొంతమంది వచ్చి నివాసం ఉంటున్నారు. ఎనిమిదేళ్లయినా పంపిణీ చేయడం లేదు. బి.కొండాపూర్‌లో ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి.



నారాయణఖేడ్‌లో డబుల్ బెడ్రూం ఇంటిలో మద్యం సీసాలు, నిజాంపేట మండలం కల్వకుంటలో పంపిణీ చేయకముందే ధ్వంసమైన కిటికీలు

● అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. అయితే సౌకర్యాలు లేక సుమారు 50శాతం మంది ఇళ్లను ఖాళీ చేశారు.

● నిజాంపేట మండలం కల్వకుంట, నందిగామ, చల్మెడ గ్రామాల్లో 210 ఇండ్లు నిర్మించగా కేవలం నందిగామలోని 40 ఇళ్లను పంపిణీ చేశారు. చల్మెడ, కల్వకుంట గ్రామాల్లోని ఇళ్లు అధ్వానంగా మారుతున్నాయి.

● దుబ్బాక మండలం బల్వంతాపూర్‌లో లబ్ధిదారులను గుర్తించలేదు. దుబ్బాక పట్టణంలో నిర్మించిన 714 ఇళ్ల వద్ద నాణ్యత లోపించింది.

● సంగారెడ్డి మండల పరిధిలోని హనుమాన్‌నగర్‌లో నిర్మించిన డబుల్ ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వకపోవడంతో పిచ్చిమొక్కలు, ముళ్లపొదల నడుమ నిరూపయోగంగా మారాయి.



ఫసల్‌వాది డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లోపంతో నిలిచిన మురికినీరు, కొమురవెల్లి మండలం గౌరాయపల్లిలో స్లాబ్ దశలోనే ఇళ్ల నిర్మాణం, సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లిలో డ్రైనేజీ, సీసీ రోడ్లు లేని ఇళ్లు, సదాశివపేట పట్టణ శివారులో వర్షానికి తడిసి దెబ్బతిన్న డబుల్ ఇళ్లు

కారెట్ల నడిపిండో.. డ్రైవర్ రావాలి

తూప్రాన్ ఆస్పత్రి వద్ద రోడ్డు ప్రమాద మృతుల బంధువుల గొడవ

- మృతదేహాలను తరలించే ట్రాక్టర్ అడ్డగింత
- ఉద్రిక్తతల మధ్య శవాల అప్పగింత
- ముగిసిన అంత్యక్రియలు



ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న బంధువులు, జగ్యాతండాలో మృతదేహాలను చూస్తు రోదిస్తున్న మహిళలు

తూప్రాన్/మెదక్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : 'కారెట్ల నడిపిండో.. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్ నామ్‌సింగ్ రావాలి.. వచ్చిన తరువాతే శవాలను తీసుకెళ్తాం' అంటూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి బంధువులు తూప్రాన్ ప్రభుత్వాస్పత్రి వద్ద గొడవకు దిగారు. బుధవారం శివ్వంపేట మండలం ఉసిరకపల్లి వద్ద చోటుచేసుకున్న చెట్టును ఢీకొని పల్టీ కొట్టి మన్నెనోని వాగులోకి కారు దూసుకెళ్లిన ఘోర రోడ్డు ప్రమాదంలో శివ్వంపేట మండలంలోని పక్కపక్క తండాల్లో నివసించే ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మృతిచెందిన విషయం విదితమే. తాళ్లపల్లి తండాకు చెందిన ధనావత్ శివరాం, ఆయన భార్య దుర్గి, ఆయన కుమార్తె జగ్యాతండాకు చెందిన మాలోతు అనిత, ఆమె కూతుళ్లు హిందు, శ్రావణి, బీమ్లా తండాకు చెందిన గుగ్లోత్ శాంతి, ఆమె కూతురు మమత ప్రాణాలు వదలగా కారు నడుపుతున్న శివరాం అల్లుడు, శాంతి భర్త నామ్‌సింగ్ తీవ్రగాయాలతో బయటపడ్డాడు. అయితే, గురువారం మృతదేహాలకు తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఆస్పత్రికి ధనావత్ శివరాం, మాలోత్ అనిత బంధువులు భారీగా చేరుకున్నారు. మాలోత్ మోహన్ భార్య, పిల్లలు మృతిచెందడంతో మోహన్ మేనమామ రమేష్, మరికొందరు ఆస్పత్రి వద్ద గొడవ చేశారు. ప్రమాదం జరిగినపుడు ఒక్కడే ఎలా బతికాడని, మిగతావారందరు ఎలా చనిపోయారని ప్రశ్నిస్తూ గొడవ చేశారు. నామ్‌సింగ్ వచ్చిన తరువాతే శవాలను తరలించాలని, మృతదేహాలను తరలించేందుకు తెచ్చిన ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. డ్రైవర్‌పై దాడికి ప్రయత్నించారు. పోలీసులు అతికష్టం మీదా సముదాయించి న్యాయం చేస్తామని, విచారణ చేయిస్తామని డీఎస్పీతో హామీ ఇవ్వడంతో తగ్గారు. ఉద్రిక్తతల మధ్య మృతదేహాలను బంధువులకు అప్పగించారు. తూప్రాన్ ఆస్పత్రికి పలువురు రాజకీయ నాయకులు విచ్చేసి కుటుంబీకులను పరామర్శించారు.

నామ్‌సింగ్ కొడుకు రాజేష్‌పై దాడికి యత్నం

శివ్వంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జగ్యా తండా, బీమ్లా తండా, తాళ్లపల్లి తండాల్లో బంధువుల రోదనల మధ్య, పోలీసుల పహారాలో అంత్యక్రియలను నిర్వహించారు. జగ్యా తండాలో అనిత, హిందూ, శ్రావణి అంత్యక్రియలకు వచ్చిన నామ్‌సింగ్ కొడుకు రాజేష్‌పై వారి బంధువులు దాడికి యత్నించారు. మీ తండ్రి చంపాడు అంటూ అనిత బంధువులు అతడిపైకి వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. అనిత భర్త మోహన్ భార్య, కూతుర్లు హిందూ, శ్రావణి మృతదేహాలను చూసేందుకు ధైర్యం చేయకపోవడం చూసి బంధువుల రోదనలు మిన్నంటాయి.

ముగిసిన కళా ఉత్సవ్ పోటీలు



కళా ఉత్సవ్‌లో గెలుపొందిన విద్యార్థులు

మెదక్ అర్బన్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులుగా మెదక్ పట్టణంలోని వెలుగు బాలికల పాఠశాలలో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఆరు విభాగాల్లో ప్రథమ స్థానం పొందిన ఆరుగురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

వాయిద్యాల పోటీల్లో అఖిల్(న్యూ హైస్కూల్, మెదక్), కథా కథనం పోటీల్లో అర్పిత(చందంపేట), నృత్య పోటీల్లో ఐశ్వర్య గ్రూప్(రత్నటెక్నో స్కూల్, మెదక్), డ్రామా పోటీల్లో సింధుగ్రూప్(సిద్ధార్థ్ మోడల్ స్కూల్, మెదక్), పాటల పోటీల్లో జీవన్(ట్రైబల్ వెల్ఫేర్, నర్సాపూర్), చిత్రలేఖనం పోటీల్లో రుచిత(మోడల్ స్కూల్, చిన్నశంకరంపేట) ఎంపికైయ్యారు.

సొసైటీ లాభాల్లో రైతులకు 10 శాతం వాటా

● కొత్తపల్లి రైతుసేవా సహకార సంఘం చైర్మన్ త్యార్ల రమేష్



మాట్లాడుతున్న త్యార్ల రమేష్

పాపన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం లాభాల్లో రైతులకు 10 శాతం వాటా ఇస్తామని పాలకవర్గ చైర్మన్ త్యార్ల రమేష్ వెల్లడించారు. గురువారం కొత్తపల్లిలో నిర్వహించిన సొసైటీ మహాజన సభలో ఆయన మాట్లాడారు. 2023-24 సంవత్సరానికి రూ.2,47,54,000 నికర లాభం, రూ.75.81 లక్షల వ్యాపార లాభం వచ్చినట్లు చెప్పారు. రుణమాఫీ కింద 1017 మంది రైతులకు రూ.6,35,63,067 రాగా, వాటిని తిరిగి రైతులకు రుణంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. వివిధ లావాదేవీలను వెల్లడించారు. అసైన్మెంట్ భూముల్లో తీసుకున్న రుణాలకు రుణమాఫీ చేయాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్, ఫీల్డ్ ఆఫీసర్ యాదగిరి, సీఈవో వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి



● కొల్లం ఎంపీ, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ కేంద్ర కార్యదర్శి ఎన్‌కే ప్రేమచంద్రన్

పటాన్‌చెరు రూరల్, అక్టోబరు 17: జాతి భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని, యువత రాజకీయాల్లోకి రావాలని కొల్లం లోక్‌సభ సభ్యుడు, రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి ఎన్‌.కె.ప్రేమచంద్రన్ పిలుపునిచ్చారు. చేంజ్‌మేకర్స్ పేరిట గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో గురువారం ఆయన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలు అంటే దేశానికి సేవ చేసే రంగంగా చూడాలని ఆయన అభిప్రాయపడ్డారు. కేరళలో తలెత్తిన కోకాకోలా ప్లాంట్ వివాదంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, పర్యావరణ సమస్యలు పారిశ్రామిక ప్రయోజనాల కోసం తరచుగా రాజీ పడటం, ముఖ్యంగా అట్టడుగు వర్గాలను ప్రభావితం చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

20న ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో ఎంపికలు

పుల్‌కల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో జూనియర్స్ ఎంపికలు ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వై.మహేందర్‌రావు, సభ్యులు నాగరాజు, పోశప్పలు తెలిపారు. నర్సాపూర్ సమీపంలోని టీటీడబ్ల్యూఆర్ఎస్‌లో ఉదయం 9 గంటల నుంచి ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని వారు పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 43వ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనేందుకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని బాల, బాలికల విభాగంలో ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 18 ఏళ్లలోపు వారై ఉండాలని, వయస్సు, ఎత్తు, బరువు కలిపి 250 పాయింట్లకు మించకూడదని వారు తెలిపారు.



స్మరణ్‌రెడ్డి

మెగాఫోన్ పట్టిన మనోడు

- డైరెక్టర్‌గా చేర్యాలవాసి
- నేడు మొదటి సినిమా రిలీజ్
- లవ్‌రెడ్డి గుర్తుండిపోతుంది : స్మరణ్‌రెడ్డి



చేర్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : చేతిలో బంతి, బ్యాట్ పట్టుకుని క్రికెటర్ అవ్వాలని అడుగులు వేసినప్పటికీ తనకంటూ ప్రత్యేకత చాటుకోవాలని, తనలో ఉన్న నైపుణ్యాన్ని వైవిధ్యంగా చూపాలని సినీ ఫీల్డ్‌కు పయనమై మెగాఫోన్ పట్టుకుని యాక్షన్, కట్ అని చెప్పడం ప్రారంభించాడు. సినీరంగంలో గాడ్‌ఫాదర్‌లు ఎవరూ లేకపోవడంతో గ్రామీణ ప్రాంత నేపథ్యం కలిగిన మనకెందుకురా సినిమాల పిచ్చి అని సూచించినప్పటికీ తానేంటూ నిరూపించుకోవాలన్న కసితో ముందుకుసాగాడు. దర్శకుడు అయ్యాడు.. సిద్దిపేట చేర్యాల మండలం గుర్జకుంట గ్రామానికి చెందిన స్మరణ్ రెడ్డి. ఆయన తీసిన లవ్‌రెడ్డి సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ విషయమై ఆంధ్రజ్యోతితో ఆయన విషయాలను పంచుకున్నాడు.

'మాది చేర్యాల మండలం గుర్జకుంట గ్రామం. తండ్రి పుర్మ రాంభూపాల్‌రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ అరుణ గృహిణి. నేను, మా చెల్లెలు సాధ్వీ. వ్యవసాయాధార కుటుంబమే అయినప్పటికీ మా తండ్రి వృత్తి రీత్యా చేర్యాలలో స్థిరపడ్డాం. చిన్ననాటి నుంచి నాకు క్రికెట్ అంటే మక్కువ. క్రికెటర్ అవ్వాలని ఎంతగానో ఆశించాను. మా తండ్రి హైదరాబాదు, ఇతర ప్రాంతాల్లో స్పోర్ట్స్ అకాడమీల చుట్టూ తిప్పాడు. నేను హైదరాబాదులో బీటెక్ చదువుతున్న సమయంలో ఆర్య సినిమా రిలీజ్ అయింది. దర్శకుడు సుకుమార్ కొత్తదనంతో తీసిన ఈ సినిమాను చూసి చాలా ఇన్‌స్పైర్ అయ్యాను. హైదరాబాదులోని మధు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూషన్‌లో చేరాను. సంవత్సరం పాటు గ్రాడ్యుయేషన్ ఫిల్మ్ కోర్స్ నేర్చుకున్నాను. అవకాశాల కోసం వెతుకుతున్న సమయంలో దర్శకురాలు నందినిరెడ్డి వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరాను. అలా మొదలైంది.. కల్యాణవైభోగమే సినిమాలకు పనిచేశాను. రుద్రమదేవి సినీ రైటర్ రాజసింహతో పాటు పలువురి వద్ద పనిచేశాను. ఆంధ్ర-కర్నాటక సరిహద్దులో ఓ ప్రేమజంట ఎదుర్కొన్న పరిస్థితుల యదార్థగాథ విని లవ్‌స్టోరీతో పాటు ఫ్యామిలీ డ్రామా, సెంటిమెంట్‌తో కూడిన కథ రాసుకున్నాను. నిర్మాతలకు చెప్పగానే కథ నచ్చి ఒప్పుకున్నారు. చాలారోజుల క్రితమే షెడ్యూల్ ప్రారంభించినప్పటికీ కరోనాతో ఆలస్యమైంది. షూటింగ్ చివరి దశలో ఉన్న సమయంలో మాతండ్రి రాంభూపాల్‌రెడ్డి అనారోగ్యానికి గురై మరణించడంతో డిప్రెషన్‌కు గురికాగా అమ్మ, చెల్లె ప్రోత్సహించారు. కర్ణాటకలో 40 థియేటర్లు, తెలంగాణ, ఏపీలలో 80 థియేటర్లలో సినిమా రిలీజ్ చేస్తున్నారు. ముందస్తుగా హిందూపూర్‌లో షో వేయగా మంచి టాక్ వచ్చింది. నేడు రిలీజ్ అవుతున్న సందర్భంగా ఎంతో ఎంగ్జైటింగ్‌గా ఉంది. ఏదో లవ్‌స్టోరీలే అని అనుకుంటూ థియేటర్‌లోకి వెళ్లినప్పటికీ గుండెనిండా బరువుతో మంచి సినిమా చూశామంటూ బయటకు వస్తారు. పక్కాగా గుర్తుండిపోతుంది. మంచి ప్రేమకథా చిత్రం లవ్‌రెడ్డిని అందరూ తప్పక ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను.'

మినీట్యాంక్‌బండ్ కల తీరేనా!?

- ఏడేళ్ల క్రితం పనులు ప్రారంభం..
- అర్ధాంతరంగా పనులు నిలిచి ఐదేళ్లు
- మత్తడినీటి ప్రవాహ మళ్లింపు కాలువ నిర్మాణానికి నిధుల మళ్లింపు
- అసంపూర్తిగానే రెండు పనులూ
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా చెరువుకట్ట.. ధ్వంసమైన శిలాఫలకం



నిలిచిపోయిన కాలువ నిర్మాణం

మినీట్యాంక్‌బండ్‌కు నోచుకోని పెద్దచెరువు కట్ట

చేర్యాల, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని పెద్దచెరువు మినీట్యాంక్‌బండ్ ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏడేళ్లక్రితం చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచి ఐదేళ్లు కావస్తున్నా నీటి పారుదలశాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. జనగామ-సిద్దిపేట ప్రధాన జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పెద్దచెరువును మినీట్యాంక్ బండ్‌గా మార్చేందుకు అప్పటి మంత్రి హరీశ్‌రావు సంకల్పించారు. గత ప్రభుత్వం ఒక నియోజకవర్గంలో ఒకే మినీట్యాంక్‌బండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో పెద్దచెరువు మినీట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు రూ.3కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఏప్రిల్ 13, 2017న శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినప్పటికీ కాంట్రాక్టర్ కట్టపైఉన్న పిచ్చిమొక్కలను తొలగించి మట్టిపోసి చేతులు దులుపుకున్నాడు.

కాలువ కోసం నిధుల మళ్లింపు

మినీట్యాంక్‌బండ్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినప్పటికీ ఏళ్లతరబడి పనులు చేపట్టకపోవడంతో నిధులు మిగిలిపోయాయి. ఈ నేపథ్యంలో పెద్ద చెరువు నిండి అలుగుపారి ప్రధాన రహదారిపై నీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. దీంతో మత్తడి నీటిని కుడిచెరువులోకి మళ్లించడానికి గాంధీ చౌక్ వరకు కాలువ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అందుకు నిధులు లేక ట్యాంక్‌బండ్ నిధులను మళ్లించి సుమారు 200మీటర్ల మేర హడావిడిగా కాలువ నిర్మాణం చేశారు. మిగతా నిధులు కూడా సరిపోకపోవడంతో ఇటు మళ్లింపు కాలువ పూర్తికాక, మినీట్యాంక్ బండ్ పనులకు సరిపడక అతీగతీ లేకుండా ఆగిపోయాయి. కానీ కాలువ కోసం రెండేళ్ల క్రితం నిధులు కేటాయించినప్పటికీ పనుల చేపట్టలేదు.

మందుబాబులకు అడ్డాగా

చెరువుకట్ట అసంపూర్తిగా మారడం, పర్యవేక్షణ కొరవడటంతో మందుబాబులకు అడ్డాగా మారింది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైంది. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవిష్కరించిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు.

కట్టపైనే ఓపెన్ జిమ్

జాతీయ ప్రధాన రహదారి వెంబడి పలువురు వాకింగ్‌కు వెళుతుండగా, కొంతమంది చెరువు కట్టపై మార్నింగ్ వాకింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీకి ఓపెన్ జిమ్ మంజూరు కావడంతో చెరువుకట్టపై ఏర్పాటు చేయడంతో నిత్యం తెల్లవారుజామున చెరువుకట్ట వాకర్స్‌తో సందడిగా నెలకొంటుంది.

కొమ్మూరి చొరవ వహిస్తేనే..

ప్రభుత్వం మారిన నేపథ్యంలో కొన్నినెలల క్రితం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పెద్ద చెరువును సందర్శించి నిధుల మంజూరు, పనుల నిలిపివేత ఇతరత్రా విషయాలపై ఆరా తీశారు. గోదావరి జలాలతో నింపడంతో పాటు మినీట్యాంక్ బండ్ పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పెద్దచెరువు మత్తడి ఆవరణస్థల పరిరక్షణకు నిర్వహించిన ఆందోళనల్లో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కీలక భూమిక పోషించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతున్నందున ఆయన చొరవ వహిస్తేనే మినీ ట్యాంక్‌బండ్ పనులు పూర్తవుతాయని పట్టణ ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఈవిషయమై నీటిపారుదలశాఖాధికారులతో పాటు స్థానిక నేతలు ఎలాంటి చర్యలు చేపడతారన్నది ఆసక్తికరంగా మారింది.

మొగులు.. గుబులు

5వ పేజీ తరువాయి

చేశారు. పత్తి పంటను లక్ష పదివేల ఎకరాల్లో, మొక్కజొన్న పంటను 25వేల ఎకరాల్లో, కంది పంటను ఆరువేల ఎకరాలలో, వరి పంట మూడు లక్షల 20వేల ఎకరాల్లో సాగుచేశారు. వర్షాలు ఎలా ఉన్నా ఈ యేడు వరి, పత్తి, మొక్కజొన్న పంటల సాగు ఆశాజనకంగా సాగింది. భారీ దిగుబడులపై రైతాంగం ఆశలు పెంచుకుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దిగుబడులు తగ్గే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికే చాలా నష్టపోయాం



5 ఎకరాల్లో వరిసాగు చేశాను. అంతకు ముందుకు కురిసిన వర్షాలకు పంట కొంత మేర దెబ్బతిన్నది. ఈ మధ్య కురిసిన వర్షాలకు చేతికొచ్చిన వరి సుమారు రెండెకరాల్లో నేలవాలింది. పంటను కొద్దామంటే వర్షాలకు పొలం తడిగా ఉంది. కోతమిషన్ దిగబడుతుందని ఆగుతున్నాం. రోజూ ఆకాశంలో మబ్బులు పడుతుండటంతో ఆందోళనగా ఉంది.

- తమ్మడబోయిన కనకయ్య, రైతు, మేడిపల్లి, చిన్నకోడూరు

సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి

సిద్దిపేట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకాన్ని గడపగడపకు తీసుకెళ్లేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అన్నసరం సురేష్‌గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రమేష్‌గౌడ్, జిల్లా మెడికల్ సెల్ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు నవీన్, త్రిలోచన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు యాదగిరి, కిసాన్ మోర్చా సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బైతి తిరుపతి, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కనకయ్య, బీజేవైఎం మండల నాయకులు సత్యం, శివ, సాయి, నర్సింగ్ బూత్ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డీఏలను వెంటనే విడుదల చేయాలి

- ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్

మిరుదొడ్డి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు డీఏలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ డిమాండ్ చేశారు. మండలంలోని కాసులాబాద్, మిరుదొడ్డి, అందె, అల్వాల్, చెప్యాల ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు సంపత్‌కుమార్, భూపాల్, బాలనర్సయ్య, వెంకటేశ్వర్లు, యాదగిరి తదితరులున్నారు.

మర్పడగ క్షేత్రంలో శరత్‌పౌర్ణమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గమాత

కొండపాక, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్పడగ శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో క్షేత్ర నిర్వాహకులు హరినాథ్‌శర్మ పర్యవేక్షణలో గురువారం శరత్ పౌర్ణమి వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. ఉదయం ఆరున్నర గంటలకు గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా విజయ దుర్గా మాతకు విశేష పూజలు నిర్వహించారు. మహా పూర్ణాహుతి భక్తుల జయజయధ్వానాల నడుమ అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు గట్టు విఠల్, మర్యాల రవీందర్, తిరుపతిరెడ్డి, నరసింహరెడ్డి, దేవసాని మల్లేశం, చీకోటి మల్లికార్జున్, రాజేంద్రప్రసాద్, అయితా బాలరాజేశం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాఉత్సవ్



కళాఉత్సవ్‌లో విద్యార్థులు, నిర్వాహకులు

సిద్దిపేట కల్చరల్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే కళాఉత్సవ్‌లో భాగంగా పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధ్వర్యంలో జిల్లాస్థాయి కళాఉత్సవ్ సిద్దిపేటలోని ఉపాధ్యాయ శిక్షణ భవనంలో గురువారం నిర్వహించారు. ఈ కళాఉత్సవ్‌లో జిల్లా పరిధిలోని 60 పాఠశాలలకు చెందిన సుమారు 220 మంది తొమ్మిదోతరగతి, పదోతరగతి, ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు. స్వర సంగీతం, వాయిద్య సంగీతం, డ్యాన్స్, డ్రామా, విజువల్ ఆర్ట్స్, స్టోరీ టెల్లింగ్ అనే ఆరు విభాగాలుగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయిలో పాల్గొంటారని, అక్కడ ప్రతిభా చాటిన విద్యార్థులు జాతీయస్థాయిలో పోటీ పడతారని అకడమిక్ మానిటరింగ్ అధికారి బేతి భాస్కర్ తెలిపారు.

'సామ్‌సంగ్ కార్మికుల పోరాటం దేశ శ్రామిక వర్గ పోరాటాలకు ఆదర్శం'

గజ్వేల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కాంచీపురం జిల్లా పెరంబదూర్ ప్లాంటులో 37రోజులపాటు సాగిన సామ్‌సంగ్ కార్మికుల వీరోచిత పోరాటం దేశ శ్రామిక వర్గ పోరాటాలకు ఆదర్శమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సామ్‌సంగ్ కార్మికులు వారి సమస్యల పరిష్కారం కోసం, యూనియన్ ఏర్పరచుకుంటే యూనియన్‌ను గుర్తించకుండా కార్మికులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్న సందర్భంలో కార్మికులందరూ ఐక్యంగా పోరాడి విజయం సాధించారన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు లోపిస్తే చర్యలే

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



తొగుట: కాన్గల్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లోపిస్తే చర్యలు తప్పవని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని పెద్దమాసాన్‌పల్లి, కాన్గల్ ప్రభుత్వ పాఠశాలల్లో దాతల సహకారంతో సమకూర్చిన క్రీడా దుస్తులను గురువారం విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాన్గల్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో పారిశుధ్యం లోపించడం పట్ల ఉపాధ్యాయులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అంతకుముందు కాన్గల్‌లో మండల పరిషత్ నిధుల ద్వారా ఏర్పాటు చేసిన వైకుంఠరథం, ఫ్రీజర్‌లను ప్రారంభించారు. అనంతరం గుడికందుల గ్రామంలో ఇటీవల విద్యుత్‌ఘాతంతో మృతిచెందిన రైతు గోరటి గురువారెడ్డి, అదే విధంగా కాన్గల్ గ్రామంలో ఇటీవల మృతిచెందిన ముడికె యాదయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, కాన్గల్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణరెడ్డి, బైరాగౌడ్, కొమురయ్య, అనిల్, రమేశ్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- దౌల్తాబాద్: బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తిరుమలాపూర్‌కు చెందిన యాకటి కిష్టయ్య ఆరు నెలల కిందట మృతి చెందాడు. కిష్టయ్యకు పార్టీ సభ్యత్వం ఉండడంతో పార్టీ మంజూరు చేసిన రూ. 2లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ దుబ్బాక నియోజకవర్గ సమన్వయ కర్త రణం శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ రైమోద్దీన్, మాజీ ఎంపీటీసీ బండారు దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్ మండల పరిధిలోని షేర్‌పల్లి బందారం, దీపాయంపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పడాల రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన

గజ్వేల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై పీఆర్టీయూ గజ్వేల్ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్ మండలంలోని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి అదరాసుపల్లి శశిధర్‌శర్మ, మండల ప్రధాన కార్యదర్శి తీగుళ్ల లింగం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నరసింహారెడ్డి, జానకిరామ్‌రెడ్డి, బషీరుద్దీన్, వేమారెడ్డి, నరసింహారెడ్డి, శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశం, రాష్ట్ర కార్యదర్శి శోభారాణి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నాగరాజు తదితరులున్నారు.

- సిద్దిపేట అర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల పాఠశాలలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి ప్రారంభించారు.

వేద విద్మన్మణి ప్రభాకర్‌శర్మ అంత్యక్రియలు

జగదేవ్‌పూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ తిగుళ్ల ప్రభాకర్ శర్మ(84) హృద్రోహ సంబంధ వ్యాధితో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి దివంగతులయ్యారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో వందలాదిమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారు.

ఆయన అంత్యక్రియల్లో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి వంటేరు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌ను కలిసిన మొగుళ్ల రాజిరెడ్డి



మహేశ్ కుమార్‌గౌడ్‌తో మాట్లాడుతున్న మొగుళ్ల రాజిరెడ్డి

చేర్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి గురువారం టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జనగామ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు, పార్టీ స్థితిగతులపై చర్చించారు.

'యాసంగిలో వేరుశనగ సాగు లాభదాయకం'

మర్కుక్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో వేరుశనగ పంట లాభదాయకమని మండల వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రవల్లిలో జయకుమార్ సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ యాసంగిలో వరికి బదులుగా రైతులు ఫ్రెంచి బీన్స్, వేరుశనగ, పొద్దుతిరుగుడు, ఇతర కూరగాయ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు.



సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోడ్డు మధ్యలో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను గురువారం తొలగించారు. సిద్దిపేట మున్సిపల్ సిబ్బంది. చెట్లను తొలగిస్తూ రోడ్డు మీద అస్తవ్యస్తంగా వదిలేశారు. దీంతో కొట్టిన చెట్ల కొమ్మలను రోడ్ల మీద నుంచి చాలాసేపు తీయకపోవటంతో వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. చెట్లకు ఉన్న కేబుల్ వైర్లు తెగి జనాల మీదకు వచ్చాయి. దారికి అడ్డంగా ఉన్న కొమ్మలను దాటుకుంటూ వాహనదారులు రాకపోకలు సాగించారు.

- సిద్దిపేట ఫొటోగ్రాఫర్

అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకుంటున్న బీఆర్ఎస్

- డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



పార్టీలో చేరిన వారితో తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పేదప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని బీఆర్ఎస్ అడ్డుకుంటుందని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆరోపించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన ఏటిగడ్డ కిష్టాపూర్, తండాకు చెందిన ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరగా, నర్సారెడ్డి వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డులు లేని నాలుగు లక్షల మంది రైతులకు త్వరలోనే ప్రభుత్వం పంట రుణమాఫీ వర్తింపజేయనున్నట్లు తెలిపారు. ఆయనవెంట ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, డైరెక్టర్లు నరసింహారెడ్డి, పట్టణ కార్యదర్శి నక్క రాములు గౌడ్, సత్తయ్య, అజ్గర్, దప్పు గణేశ, అంజత్, కిష్టారెడ్డి ఉన్నారు.

వాల్మీకి జయంతి వేడుకలు

హుస్నాబాద్ అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 17: హుస్నాబాద్ పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో బోయ వాల్మీకి జయంతిని గురువారం నిర్వహించారు. పురపాలక సంఘ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్లు నళినిదేవి, రమాదేవి, స్వర్ణలత, భాగ్యరెడ్డి, లావణ్య, పద్మ, వేణు, మ్యదరబోయిన శ్రీనివాస్, రవి, దొడ్డి శ్రీనివాస్, గుళ్ల రాజు, కల్పన, సరోజన, రత్నమాల, వల్లపు రాజు, రమేష్, హరీష్, మున్సిపల్ మేనేజర్ బాలకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలఎల్లం, మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

- చేర్యాల: చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, మంగోలు చంటి, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, వార్డు అధికారుల, సిబ్బంది వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలి'



సిద్దిపేట రూరల్: చింతమడకలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ సీసీ భాగ్యలక్ష్మి

సిద్దిపేట రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఐకేపీ సీసీ భాగ్యలక్ష్మి సూచించారు. సిద్దపేట రూరల్ మండలం చింతమడక, సీతారాంపల్లి గ్రామాల్లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని తీసుకురావాలని సూచించారు. ధాన్యం క్వింటాలుకు ఎ గ్రేడ్ రకం రూ.2320లు, కామన్ గ్రేడ్ రకం రూ.2300లు ప్రభుత్వం మద్దతు ధర అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సురేష్, ఎఈవో భూవన చంద్రిక, మహిళా సంఘాల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

- దుబ్బాక: దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ వనితా, పీఏసీఎస్ చైర్మన్ కైలాస్‌లు ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ కైలాస్ ఎమ్మెల్యే, సముదిరాజ్ ధ్యాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించగానే, తనకు సమాచారం లేదంటూ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వనరేష్ వెంటనే కాంగ్రెస్ కార్యకర్తలు, కొంతమంది డైరెక్టర్లతో కలిసి వచ్చి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కొబ్బరికాయ కొట్టారు.

ఎవరి ప్రయోజనాల కోసం బీటీ రోడ్లు

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్

మద్దూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో అధ్వానంగా మారిన మట్టి రోడ్లకు బీటీ రోడ్లు శాంక్షన్ చేయించకుండా జనసంచారం లేని గ్రామాలకు ఎవరి ప్రయోజనాల కోసం బీటీ రోడ్లు మంజూరు చేస్తున్నారో చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ డిమాండ్ చేశారు. మండలంలోని ధర్మారం, వంగపల్లి గ్రామాల్లో సీపీఎం శాఖ మహాసభలను పురస్కరించుకుని గురువారం ఎర్రజెండాలు ఎగురవేశారు. అనంతరం నిర్వహించిన మహాసభలో మాట్లాడారు. ధర్మారం నుంచి రేబర్తి వరకు గతంలో మంజూరైన బీటీరోడ్డును పూర్తి చేయకుండానే గుత్తేదారు వదిలేశారని, వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆలేటి యాదగిరి, చొప్పరి రవికుమార్, రమేష్, సత్తయ్య, రాజన్న, శ్రీను, జక్కుల ఎల్లయ్య, కొండూరి లక్ష్మణ్, బియ్య రాజయ్యతో పాటు పలువురు ఉన్నారు.

- కొండపాక: మండలంలోని బందారంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాలనర్సయ్య డిమాండ్ చేశారు. గ్రామంలో సీపీఎం గ్రామ మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పాఠశాల నుంచి చెరువు కట్ట వరకు రోడ్డు పనులను నిలిపివేశారన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు బి.కొమురయ్య, మల్లేశం, ఎల్లయ్య, నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కాత అంతంతే..

- పంటకు తెగుళ్ల బెడద
- ఆందోళనలో రైతులు



కోహెడ మండలం కాచాపూర్‌లో ఏపుగా పెరిగిన పత్తి

కోహెడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆశాజనకంగా మొక్కలు కనిపిస్తున్నా.. పత్తి కాయలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు వర్షాలు అనుకూలంగా కురుస్తూనే ఉన్నాయి. పొడి దుక్కిలో విత్తనాలు విత్తుకోగా తొలకరి వర్షాలకు విత్తనాలు మొలకెత్తిన పంటలు పర్వాలేదనిపిస్తుండగా, ఆ తర్వాత మొలకొత్తిన పంటల్లో కాత, పూతలు అంతంత మాత్రంగానే కనిపిస్తుండడంతో రైతులను కలవరపడుతున్నారు. పంట పూత, కాతలకు వచ్చేందుకు రైతులు క్రిమిసంహారక మందులు విచ్చలవిడిగా పిచికారి చేసినా అధికంగా దిగుబడి రావడం లేదు. వాయుగుండం ప్రభావంతో వాతావరణంలో ఏర్పడిన మార్పులతో తెగుళ్లు వ్యాపించి పంటలు దెబ్బతింటున్నాయి. ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్లు దిగుబడి రావల్సి ఉంది. కానీ 4 నుంచి 5 క్వింటాళ్లు దిగుబడి వస్తోంది.

పంటలకు తెగుళ్లు

విపరీతంగా తెగుళ్ల ఆశించి పత్తి పంటను పీల్చి పిప్పిచేస్తున్నాయి. వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల కారణంగా పంటల్లో ఆకుముడత ఉధృతి అధికంగా ఉన్నది. పొగమంచు కారణంగా పంటలను పచ్చదోమ, తెల్లదోమ ఆశించి దెబ్బతీస్తున్నాయి. పత్తి ఆకుల కింద దోమలు రసం పీల్చుతుండడంతో ఆకులు ముడతగా మారి ఎదుగుదల లోపిస్తుంది. దీంతో దోమను అరికట్టేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

10 నుంచి 20 లోపే కాయలు

మండలంలోని 27 గ్రామ పంచాయతీల పరిధిలో 6,968 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. తొలకరి వర్షాల కంటే ముందే రైతులు విత్తనాలను విత్తుకున్నారు. అయితే అడపాదడపా పడ్డ వర్షాలకు ప్రారంభంలో సరిగా విత్తనాలు మొలకెత్తలేదు. రెండోసారి, మూడోసారి విత్తుకోవాల్సి వచ్చింది. వర్షాలు సమృద్ధిగా కురవడంతో కొంతమంది రైతులకు చెందిన భూముల్లో మాత్రమే విత్తనాలు ఆశాజనకంగా మొలకెత్తాయి. ప్రస్తుతం మండలంలో పత్తి పంటకు మూడు నెలల కాలము పూర్తయింది. అయితే చాలా గ్రామాల్లో చెట్లకు ఆశించిన స్థాయిలో కాయలు పడకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెట్టుకు 5 నుంచి 10 లోపు కాయలు మాత్రమే ఉండడంతో రైతులను కలత చెందుతున్నారు.

ధర లేకపోతే నష్టాలే

సీజన్ ప్రారంభంలో ఉండే ధరపైనే రైతులు ఆశపెట్టుకుంటున్నారు. సాధరణంగా సీజన్ ప్రారంభంలో పత్తి వ్యాపారులు అధిక ధరల చెల్లించి పత్తిని కొనుగోలు చేస్తుంటారు. ఈ సంవత్సరం ప్రభుత్వం పత్తికి క్వింటాకు రూ 7300 మద్దతు ధర ప్రకటించింది. కానీ సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపట్టలేదు. వ్యాపారస్తులు తేమశాతం ఉన్న దానినీ కొనుగోలు చేస్తున్నారు. పత్తి పచ్చిగా ఉందని ధర రూ 4 వేల నుంచి 5,500 వరకు చెల్లిస్తున్నారు. క్రమంగా ఈ ధర ఇంకా తగ్గుతుందేమోనని రైతులు భయపడుతున్నారు. సీసీఐని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

పత్తి ధర అనుకూలంగా ఉంటేనే లాభం

పత్తి ధర అనుకూలంగా ఉంటనే లాభం. పత్తి సాగులో పెరుగుతున్న పెట్టుబడులకు అనుగుణంగా ప్రభుత్వం మద్దతు ధర కల్పించడం లేదు. ఎకరానికి రూ 40 వేలు ఖర్చు అవుతుంది. దిగుబడి మాత్రం 5 నుంచి 7 క్వింటాళు మాత్రమే వస్తున్నది. ఈసారి ఆశించిన స్థాయిలో కాత కనిపించడం లేదు

- బాల్‌రెడ్డి, యువ రైతు, తీగలకుంటపల్లి